
# పోతనభాగవతంలో రసగుళికలు



## – ఆర్.శర్మ దంతుర్తి

## 131 వ భాగం

## మత్స్యావతారం - 3

తానెవరో, ఎందుకు మత్స్యావతారం ఎత్తవల్సివచ్చిందో చెప్పి శ్రీహరి సముద్రంలోకి వెళ్ళాక తనని అనుగ్రహించిన భగవంతుణ్ణి తల్చుకుంటూ సత్యవ్రతుడు తన చోటికి తిరిగివచ్చాడు.

ఆ. మత్స్యరూపి యైన మాధవు నుడుగులుఁ
దలఁచికొనుచు రాచతపసి యొక్క
దర్భశయ్యఁ దూర్పుఁ దలగడగాఁ బండి
కాచి యుండె నాఁటి కాలమునకు. [8-708]

మాధవుడు మత్స్యావతారంతో తనతో చెప్పిన మాటలు (నుడుగులు) తల్చుకుంటూ, తూర్పుగా తలపెట్టి పడుకుని కల్పాంతం కోసం వేచి (కాచి యుండె) ఉన్నాడు రాచతపసి. ఇప్పుడు కల్పాంతం ఎలా మొదలైందో వివరిస్తున్నాడు. మరోసారి పోతన వాడిన తెలుగు పదాలు గమనించండి.

క. ఉల్లసిత మేఘ పంక్తులు
జల్లించి మహోగ్రవృష్టి జడిగొని కురియన్
వెల్లి విరిసి జలరాసులు
చెల్లెలి కట్టలను దాఁటి సీమల ముంచెన్. [8-710]

మెరుపులతో కూడిన (ఉల్లసిత) మేఘాలు మహోగ్రమైన వర్షాలు కురిపించేసరికి జలరాసులు (సముద్రాలు) పెరిగి చెలియలు కట్టలు దాటి సీమలని (దేశదేశాలనీ) ముంచాయి. ప్రాణికోటి అంతరించింది. దీని సంగతి కొంచెం చూద్దాం. భూమి మీద కర్బనోదకాలు ఎక్కువై అకాలిక వర్షాలు, ఎక్కువ ఉష్ణోగ్రతలూ వస్తాయి అని చెప్తున్నా ఎవరికీ పట్టినట్టులేదు. కొంతకాలానికి ఈ భూమి పనికిరాకుండా పోతుందనేది సత్యం. ఇది సూర్యుడి ప్రతాపం వల్ల కూడా, సూర్యుడు ఒక నక్షత్రం కనక, అలా జరుగుతుంది అని చెప్తున్నారు ఎప్పట్నుంచో. దానివల్ల ఓ రోజుకి ఈ భూమి పనికిరాదు జీవితానికి. మరోచోటికి పోవడానికో దారి ఉండాలి. వెళ్ళేది కూడా అంతరిక్షంలోకి, అక్కడ మరో భూమిలాంటి గ్రహం వెతుక్కోవడానికీ అని మనకి తెల్సినదే. ఈ కల్పాంతం అటువంటిదే అనుకుని ముందుకి సాగుదాం కధలోకి.

మ. నెఱి నెల్లప్పుడు నిల్చి ప్రాణిచయమున్ నిర్మించి నిర్మించి వీఁ
పిఱయన్ నీల్గుచు నావులించుచు నజుం డే సృష్టియున్ మాని మే
నొఱఁగన్ ఱెప్పలు మూసి కేల్ దలగడై యుండంగ నిద్రించుచున్
గుఱు పెట్టం దొడఁగెం గలల్ గనుచు నిర్ఘోషించుచున్ భూవరా! [8-714]

బ్రహ్మకి పగలు గడిచింది. రోజులో పొద్దున్న నుంచి సాయంత్రం వరకూ ప్రాణులని నిర్మిస్తూ ఉన్న ఆయన అలిసినవాడై వీపు విరుచుకుని, ఆవులించుతూ సృష్టి చేయడం మాని, వళ్ళు తెలియకుండా (మేనొరగన్) కళ్ళు మూసుకుని, చేయి (కేల్) తలగడగా చేసుకుని, గట్టిగా (నిర్ఘోషించుచున్) గుర్రుపెట్టి, కలలు కంటూ నిద్రలోకి జారిపోయేడు. ఇందులో పోతన మనం నిద్రలోకి ఎలా జారుకుంటామో చెప్తూ మనకి అర్ధం అయ్యేలా బ్రహ్మ కూడా కలలు కంటూ, గుర్రు పెట్టి నిద్రలోకి జారాడు అని హాస్యం జోడించాడు.

ఆ. అలసి సొలసి నిదుర నందిన పరమేష్ఠి
ముఖము నందు వెడలె మొదలి శ్రుతులు
నపహరించె నొక హయగ్రీవుఁ డను దైత్య
భటుఁడు; దొంగఁ దొడర బరుల వశమె? [8-715]

ఇలా అలసిపోయిన బ్రహ్మ (పరమేష్ఠి) మొహంలోంచి వేదాలు (మొదలి శృతులు) బయటకి వచ్చాయి. వాటిని హయగ్రీవుడనే రాక్షసుడు (దైత్యభటుడు) అపహరించాడు. ఇలాంటి దొంగతనం (దొంగన్) చేయడం (తొడర) ఇంకెవరికైనా సాధ్యం అవుతుందా?

క. చదువులుఁ దన చేఁ బడినం
జదువుచుఁ బెన్ బయల నుండ శంకించి వడిం
జదువుల ముదుకఁడు గూరుకఁ
జదువుల తస్కరుఁడు చొచ్చె జలనిధి కడుపున్. [8-716]

ఈ పద్యంలో గమనించండి, పోతన చదువు అనే పదాన్ని నాలుగు పాదాల్లో ఎలా వాడాడో. చదువులు (వేదాలు) తన చేతిలో పడగానే వాటిని చదవడం మొదలుపెట్టాడు (చదువుచున్) కానీ అందరికీ కనిపించేలా బయట ఉండడం శంకించి, బ్రహ్మదేవుడు (చదువుల ముదుకడు–వేదసారాన్ని గ్రహించినవారిలో వృద్ధుడు, లేదా బాగా నేర్పున్నవాడు) నిద్రలో ఉండగా రాక్షసుడు (చదువుల తస్కరుడు, వేదాలని అపహరించినవాడు) సముద్ర గర్భంలోకి (జలనిధి కడుపున్) వెళ్ళిపోయాడు.

వ. ఇట్లు వేదంబులు దొంగిలి దొంగరక్కసుండు మున్నీట మునింగిన, వాని జయింపవలసియు, బ్రానుదీఁగెల విత్తనంబుల పొత్తరలు పెన్నీట నాని చెడకుండ మనుపవలసియు నెల్ల కార్యంబులకుం గావలి యగునా పురుషోత్తముండప్పెను రేయి చొరుదల యందు. [8-717]

ఇలా వేదాలని అపహరించిన దొంగ రాక్షుడు నీటిలో మునగగానే వాడిని జయించడానికి, ఈ వేదాలు చెడకుండా ఉండడానికీ, వృక్షాలు, విత్తనాలు మిగతా అవసరమైనవన్నీ నీటిలో పడి పాడవకుండా ఉండడానికీ ఎల్లవేళలా కాపలా కాసేవాడూ, సృష్టిలో అన్నికార్యాలకీ కావలీ అయిన పురుషోత్తముడు ఈ చీకటిలో హయగ్రీవుడున్న ప్రదేశంలో ప్రవేశించాడు – మీనరూపంలో.

క. కుఱుగఱులు వలుఁద మీసలు
చిఱుదోకయుఁ బసిఁడి యొడలు సిరిగల పొడలున్

నెఱి మొగము నొక్క కొమ్మును
మిఱుచూపులుఁ గలిగి యొక్క మీనం బయ్యెన్. [8-718]

వ. ఇట్లు లక్ష యోజనాయతం బయిన పాఠీనంబై విశ్వంభరుండు జలధి చొచ్చి. [8-719]

ఈ మీనం ఎలా ఉందో చెప్తున్నాడు. చిన్న చిన్న రెక్కలు, (కుఱుగఱులు), పెద్ద మీసాలు (వలుద మీసలు), చిన్న తోక, బంగారు రంగు శరీరం (పసిడి యొడలు), అందమైన మచ్చలు (సిరిగల పొడలున్), నిండైన మోహం (నెఱి మొగము), ఒక కొమ్ము, మిరుమిట్ల చూపు (మిఱుచూపులు) ఉన్న చేపలా విశ్వంభరుడు (విశ్వాన్ని భరించేవాడు, భగవంతుడు) తయారయ్యేడు. ఈ మీనం (పాఠీనం) లక్ష యోజనాల పొడవుతో సముద్రంలోకి చొచ్చుకుని వెళ్ళింది. ఈ వివరణ చూస్తే పాలసముద్ర మథనంలో కూర్మావతారం పద్యాలు గుర్తుకొస్తాయి [8-201 నుంచి].

వ. అంతకు మున్న సత్యవ్రతుండు మహార్ణవంబులు మహీవలయంబు ముంచు నవసరంబున భక్త పరాధీనుండగు హరిఁ దలంచుచు నుండ నారాయణ ప్రేరితయై యొక్క నావ వచ్చినం గనుంగొని. [8-721]

మ. చని సత్యవ్రతమేదినీదయితుఁ డోజం బూని వ్రాన్డీఁగె వి
త్తనముల్ పెక్కులు నావపై నిడి హరిధ్యానంబుతో దానిపై
ముని సంఘంబులుఁ దాను నెక్కి వెఱతో మున్నీటిపైఁ దేలుచుం
గనియెన్ ముందట భక్తలోక హృదలంకర్మీణమున్ మీనమున్. [8-722]

ఆ మీనం అలా ఉన్నప్పుడు సముద్రాలన్నీ (మహార్ణవంబులు) భూమిని (మహీవలయంబు) ముంచుతూంటే, ఇటు పక్క సత్యవ్రతుడు దగ్గిరకి ఒక నావ చేప చెప్పినట్టూ వచ్చింది. దానిలో విత్తనాలు, మావులు, తీగలూ అన్నీ నారాయణుడు చెప్పినట్టూ అమర్చాడు సత్యవ్రతుడు. హరిధ్యానంతో సప్త ఋషులని చేర్చి తానుకూడా ఎక్కాక మరోసారి ఆ మహామీనాన్ని చూసాడు. అది భగవంతుడి అవతారం కనక భక్తుల హృదయాలని ఆకర్షించేది (భక్తలోక హృదలంకర్మీణమున్).

వ. కని జలచరేంద్రుని కొమ్మున నొక్క పెనుఁ బాపత్రాటన నావఁ గట్టి, సంతసించి దెందంబు నివురుకొని తపస్వులుం దాను నా రాచపెద్ద మీనాకారుండగు వేల్పుతేని నిట్లని పొగడం దొడంగె. [8-723]

ముందు చేయమని చెప్పినట్టూ, ఈ నావని పెద్ద పాముతో చేప కొమ్ముకి కట్టి, భగవంతుణ్ణి ఇలా సహాయం చేసినందుకు పొగడం మొదలుపెట్టాడు. ఎవరు? రాచపెద్ద. ఇది సత్యవ్రతుడికి వాడిన మరో పేరు. ధ్రువుడి కథలో కూడా వరం కోరుకోవడానికి ముందు కనిపించిన విష్ణువుని స్తుతించడానికి నోరు పెగలకపోతే తన శంఖాన్ని కుర్రాడి దవడకి ఆనించాక సామవేదంతో కీర్తించడం చూస్తాం. కనిపించిన భగవంతుణ్ణి స్తుతించడం మొదటి పని కదా భక్తుడికి? అందువల్ల సత్యవ్రతుడు చెప్తున్నాడు.

మ. తమలోఁ బుట్టు నవిద్య గప్పికొనుడుం దన్మూలసంసార వి
భ్రములై కొందఱు దేలుచుం గలఁగుచున్ బల్వెంటలన్ దైవ యో
గమునం దే పరమేశుఁ గొల్చి ఘనులై కైవల్య సంప్రాప్తులై
ప్రమదంబందుదు రట్టి నీవు కరుణం బాలింపు మమ్మీశ్వరా! [8-724]

మొదటినుంచీ చెప్పుకున్న విషయమే అయినా మరోసారి. అవిద్య, అంటే సత్యం ఇదీ అని తెలియకపోవడం వల్లే మనం సంసారంలో (జననం మరణం) చిక్కుకుంటూ మోసపోతూ ఉంటాం. ఒక్కోసారి కొంతమందికి దైవానుగ్రహం వల్ల కైవల్యం ప్రాప్తిస్తూ, సంతోషపడడం (ప్రమదంబందుదు) ఉండడం గమనిస్తున్నాం. వారికి మోక్షం ఇచ్చేది నీవే కాబట్టి మమ్మల్ని కూడా కరుణతో చూడు. ఈ విషయం అనేకమంది యోగులు చెప్పడం చూడవచ్చు. ఎంతో కష్టమైన బ్రహ్మాన్ని చూడాలంటే ప్రయత్నం చేయాలి, ప్రపంచాన్ని విడనాడాలి, వగైరా. అన్నీ చేసినా చివరకి భగవదనుగ్రహం లేకపోతే మరో జన్మ ఎత్తవల్సిందే. ఈ అనుగ్రహం ఎలా ఎప్పుడు ఎవరిమీద పడుతుందో భగవంతుడి తప్ప మరొకరికి తెలియదు. అందువల్ల అలా ప్రయత్నం చేస్తూనే ఉండాలి. భాగవతంలో ముచికుందుడి కథలాగా ఈ విషయం అనేక చోట్ల చూడవచ్చు.

ఉ. కన్నులు గల్గువాఁడు మఱి కాననివారికిఁ ద్రోవఁ జూపఁగాఁ
జన్న తెఱంగు మూఢునకు సన్మతిఁ దా గురుఁడౌట సూర్యుఁడే
కన్నులుగాఁగ భూతములఁ గాంచుచు నుండు రమేశ! మాకు ను
ద్యన్నయమూర్తివై గురువవై యల సద్గతిజాడఁ జూపవే. [8-725]

కన్నులు ఉన్నవాడు అవి లేనివాడికి దారి చూపినట్టే, మూఢులకి మంచి దారి చూపగల హరీ, (రమేశ, రమ లేదా లక్ష్మికి ఈశ్వరుడు, లక్ష్మీపతి) సూర్యుడే కన్నులుగా, అన్ని భూతాలని (జీవులని) అన్నింటినీ చూడగల గల నువ్వు మాకు గురువువై, ఉద్ధరించేవాడివై (ఉద్యన్నయమూర్తివై) సద్గతికి దారి చూపించు. గమనించారా, ఈ విలయంలోంచి రక్షించు అని అడగడంలేదు సత్యవ్రతుడు. సద్గతి, అంటే ఆత్మ సాక్షాత్కారానికి దారి చూపించు అని అడుగుతున్నాడు. ఇదే భగవంతుణ్ణి అడిగే విధం. ఇది కావాలి అది కావాలి అని కాదు, కైవల్యం, లేదా జనన మరణాలనుండి విముక్తి. మత్స్యావతారంలో మిగతా కథ వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS